

పత్తి క్వింటా రూ.6,686

ఆదోని అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 1,148 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి వచ్చింది. క్వింటా గరిష్ట ధర రూ.6,686 పలికింది.



మండుతున్న ఎండలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. బుధవారం మంత్రాలయంలో 44.34 , చాగలమర్రిలో 43.61 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



బదిలీల సందడి

ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి మొదలైంది. ఉద్యోగులు, సిబ్బంది సర్వీసు వివరాలను పరిశీలించే కార్యక్రమంలో అధికారులు నిమగ్నమయ్యారు. 8లో

న్యూస్‌రీల్

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

బొమ్మలసత్రం: నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సబ్‌డివిజన్‌లోని అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులకు శిక్షపడేలా సాక్ష్యాధారాలు సేకరించి కోర్టుకు సమర్పించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవిలో చోరీలు జరిగే అవకాశాలు ఉన్నందున రాత్రి గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పరీక్ష ఫీజు గడువు

నంద్యాల (న్యూటౌన్): ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజుల చెల్లింపు గడువు నేటి(గురువారం)తో ముగియనుంది. ఒక సబ్జెక్టుకు రూ.25 ప్రకారం అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి 29వ తేది వరకు, రూ.50 తో 30, 31 తేదిల్లో పరీక్ష ఫీజులు చెల్లించవచ్చు. పదో తరగతిలో ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5, పరీక్ష ఫీజు రూ.95 మొత్తం రూ.100 ప్రకారం, ఇంటర్మీడియేట్ ఒక సబ్జెక్టుకు థీయరికి రిజిస్ట్రేషన్‌కు రూ.5, పరీక్ష ఫీజు రూ.145 మొత్తం రూ.150, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.100 ప్రకారం ఫీజులు చెల్లించాలి. ఫెయిల్ అయిన ఇంటర్మీడియెట్ విద్యార్థులు పాసైన సబ్జెక్టులలో మార్కులను పెంచుకునేందుకు (ఐదు సంవత్సరాలలో కేవలం ఒకసారి మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంటుంది) థీయరి ఒక సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్‌లో ఒక సబ్జెక్టుకు రూ.100 ప్రకారం చెల్లించాలి. పరీక్షల ఫీజులు ఏపీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి.

ఉపాధి కూలీలకు కనీస వేతనం కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

మహానంది: ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రభుత్వ నిబంధనల మేరకు కనీస వేతనం రూ.272 వచ్చేలా పనులు కల్పించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బొల్లవరంలో జరుగుతున్న అమృత్ సరోవర్ ప్రాజెక్ట్ పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీఓ మనోహర్, ఈసీ రామేశ్వరరెడ్డి, ఎఫ్ఏ ఎల్లయ్యలతో వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మేటీలు సుధారాణి, హైమావతి పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

కర్నూలు(సిటీ): పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ జారీ చేసింది. గురువారం నుంచి జూన్ 1 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియకు ఫీజు చెల్లించాలి. ఫీజు చెల్లించినవారి సర్టిఫికెట్లను ఈనెల 29 నుంచి జూన్ 5వ తేదీ వరకు పరిశీలించనున్నారు. వెరిఫికేషన్ చేయించుకున్నవారు జూన్ 1నుంచి 6వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశాన్ని కల్పించారు. ఆప్షన్స్‌ను జూన్ 7వ తేదీన మార్పులు చేసుకోవచ్చు. వచ్చే నెల 9వ తేదీన కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి ర్యాంకుల ఆధారంగా సీట్లను కేటాయించనున్నారు.

కోటి ఆశలతో..



జిల్లాలో ఖరీఫ్‌లో సాగు అయ్యే పంటల విస్తీర్ణం అంచనా

పంట	హెక్టార్లలో
వరి	67,890
మొక్కజొన్న	35,035
కందులు	29,131
మినుములు	7,884
వేరుశనగ	13,397
పత్తి	22,410
మిర్చి	25,012
ఇతర పంటలు	28,225
మొత్తం	2,28,984

- ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్న రైతులు
- జిల్లాలో 2.28 లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం
- అత్యధికంగా 67 వేల హెక్టార్లలో వరి సాగయ్యే అంచనా
- మిర్చి వైపు చూస్తున్న అన్నదాతలు

నంద్యాల: కష్టజీవి మరో సారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నాడు. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవడం, గిట్టుబాటు ధర లభించడం, ప్రభుత్వం అండగా నిలవడంతో గట్టెక్కిన రైతన్న మళ్లీ కోటి ఆశలతో పొలం బాట పట్టాడు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాడు. వేసవి దుక్కులు పూర్తి చేసుకుని గట్ల పటిష్టం, నీటి బోదెల తవ్వకాలు, తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుత వాతావరణంలో వచ్చిన మార్పులతో పచ్చిరొట్ట ఎరువులు చల్లుకునేందుకు సిద్ధమయ్యాడు. జిల్లా వ్యవసాయ అధికారులు ఖరీఫ్‌లో సాగు కానున్న పంట విస్తీర్ణం అంచనా మేరకు విత్తనాలు, రాయితీతో ఇచ్చేందుకు కార్యాచరణ మొదలుపెట్టారు. నంద్యాల జిల్లాలో ఈ ఏడాది



భూసార పరీక్షల నిమిత్తం మట్టిని సేకరిస్తున్న దృశ్యం

ఖరీఫ్‌లో 2,28,984 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని అంచనా వేశారు. ప్రధానంగా వరి 67,890 హెక్టార్లలో సాగు అవుతుందని భావిస్తున్నారు. నీటి లభ్యతను బట్టి ఈ సారి కూడా లక్ష్యాన్ని మించి పంటలు అధికంగా సాగు అయ్యే అవకాశం ఉంది. సకాలంలో వర్షాలు కురవడం, కాల్వలో విడుదలయ్యే నీటితో పాటు నమోదయ్యే వర్షపాతాన్ని బట్టి ఎంత విస్తీర్ణం సాగు అవుతుందని ఆధారపడి ఉంటుంది. గత ఏడాది ఖరీఫ్‌లో 2,15,270 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. కాగా ఖరీఫ్, రబీలో వరి సాగు చేసిన రైతుల పంట పండింది. ఖరీఫ్‌లో ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు, రబీలో 55 నుంచి 60 బస్తాలు ఎన్నడూ లేని విధంగా దిగుబడి రావడంతో లాభాలు పొందారు. అదే విధంగా మిరప రైతుల ఇంట కాసుల పంట పండింది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పాటు ధర క్వింటా రూ.22వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలకడంతో మిరప సాగు చేసిన రైతులు లాభపడ్డారు.

మిరప సాగు వైపు రైతుల చూపు..

జిల్లాలో అత్యధికంగా వరితో పాటు మిరప, పత్తి, మొక్కజొన్న, కందులు, మినుములు, వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తారు. నీటి వనరులు అధికంగా ఉండటంతో వరిని అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. అయితే గత ఏడాది మిరప సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.2 నుంచి రూ.3 లక్షల ఆదాయం పొందడంతో ఈ ఏడాది మిరప సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో మిరప సాగు చేసే పొలాలకు గుత్తలు కూడా అధిక రేట్లు పలుకుతున్నాయి. గత ఏడాది ఎకరా రూ.20వేల నుండి రూ.30 వేల వరకు గుత్త ఉండగా ఈ ఏడాది రూ.50వేల వరకు పెరగడమే ఇందుకు నిదర్శనం. గతేడాది జిల్లా వ్యాప్తంగా 12,500 హెక్టార్లలో మిరప సాగు కాగా ఏడాది దాదాపు 25 వేల హెక్టార్లలో సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అధిక దిగుబడులే లక్ష్యంగా..

వ్యవసాయంలో రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. విత్తనం మొదలు పంట విక్రయాల వరకు అండగా నిలిచి ఆదుకుంటోంది. ఈ మేరకు ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతుండగా అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మే నెలాఖరులోగా పొలాన్ని సిద్ధం చేసుకొని జూన్ మొదటి వారంలోనే ఖరీఫ్ సాగు ప్రారంభించేలా సూచిస్తున్నారు. ఈ మేరకు అధికారులు ప్రత్యేక సమావేశాలు, సదస్సులు నిర్వహించి మెలకువలు వివరిస్తున్నారు.

ఆర్‌బీకేల్లో సందడి షురూ.

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం అందజేసే సబ్సిడీ విత్తనాల కోసం రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుంటున్నారు. 50 శాతం రాయితీతో అందజేసే పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, పిల్లి పెసర, జనుము, 30 శాతం రాయితీతో అందజేసే మినుము, పెసల విత్తనాలు కోసం రైతులు తమ ఆధార్ కార్డులతో రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు.

ఎరువులకు ప్రతిపాదనలు

జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడకుండా జిల్లా వ్యవసాయాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాకు 1,91,317 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందులో యూరియా 60,339 మెట్రిక్ టన్నులు, డీఏపీ 22,504, ఎంఓపీ 6,798, ఎన్‌పీకేఎస్ 95,827, ఎస్ఎస్‌పీ 2,605, కంపోస్టు 3,253 మెట్రిక్ టన్నులు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఖరీఫ్‌కు సంబంధించిన ఎరువులు ఈ వారంలో వచ్చే అవకాశం ఉంది.

సకాలంలో నాట్లు వేసువాలి



ఈ ఖరీఫ్‌కు రైతులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. త్వరలో పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తాం. రైతులకు అవగాహన కల్పించడం ద్వారా సాగు త్వరగా పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించాం. విత్తనాలు, ఎరువులు, ఇతర సమస్యలు ఎదురవ్వకుండా చర్యలు తీసుకున్నాం. సాగునీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. వరి సాగు చేసే రైతులు జూన్ మొదటి వారంలో నాట్లు వేసుకుంటే మంచిది. – మోహన్‌రావు, డీఏఓ, నంద్యాల

మల్లన్న సేవలో జగద్గురు పీఠాధిపతి



ఆలయ ప్రాంగణంలో శ్రీజగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామ శివాచార్య మహాస్వామిజీ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామశివాచార్య మహాస్వామిజీ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ లవన్న, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు వేదగోష్టి నిర్వహించగా, ఈఓ స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డుప్రసాదాలను సమర్పించారు.

కొలిమిగుండ్లకు బ్లాక్ హెల్త్ యూనిట్ మంజూరు

కొలిమిగుండ్ల: జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద కొలిమిగుండ్లకు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ మంజూరైంది. ఇందు కోసం రూ.50 లక్షల నిధులు విడుదలయ్యాయి. జిల్లాలో కొలిమిగుండ్లతో పాటు బండిఆత్మకూరు, శిరివెళ్ల, పాములపాడు, మరో మూడు చోట్ల బ్లాక్ హెల్త్ యూనిట్‌లు మంజూరయ్యాయి. మండల కేంద్రాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకంతో అభివృద్ధి చేయడంతో రోగులకు మరింత సౌకర్యంగా మారాయి. వైద్య సేవలు మెరుగుపడ్డాయి. జిల్లా కేంద్రాలకు సుదూరంగా ఉన్న మండలాలకు ప్రాధాన్యత కల్పించారు. రూ.50 లక్షలతో మూడు విభాగాలకు సంబంధించి నిర్మాణాలు చేపట్టనున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా కొత్తగా వైద్యుల నియామకం, పరికరాలు కొనుగోలు చేయనున్నారు. బ్లాక్ డయాగ్నిస్టిక్ హబ్‌గా పని చేయనుంది. కొలిమిగుండ్లలోని పీహెచ్‌సీ ఆవరణలో విశాలమైన ఖాళీ ప్రదేశంలో బ్లాక్ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి.

లోకేశ్ ఓ జోకర్

- అవాస్తవాలు మాట్లాడితే సహించేది లేదు
- తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరు
- తల్లి చనిపోతే ఎమ్మెల్యే.. తండ్రి చనిపోతే మంత్రి అయినోన్ని కాను
- నా పేరున 200 ఎకరాలు ఎక్కడ ఉందో చూపితే లోకేశ్‌కే ఇచ్చేస్తా
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: కనీస పరిజ్ఞానం లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్న నారా లోకేష్ ఓ జోకర్ అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో మంగళగిరి ప్రజలు నారా లోకేశ్‌ను ఓడించి బట్టలు ఊడదీశారన్నారు. యువగళం పాదయాత్ర పేరుతో చంద్రబాబు నాయుడు తన కుమారుడికి లంగోటా కట్టి రాష్ట్రం మీదకు వదిలారన్నారు. నారా లోకేశ్ ఎమ్మెల్యేపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ప్రజలు ఆ లంగోటాను కూడా తీసేస్తారని ఎద్దేవా చేశారు. ఇసుక, ఎర్రమట్టి అక్రమ రవాణా, ఐ ట్యాక్స్ అంటూ విమర్శించిన లోకేశ్ ముందుగా టీడీపీ నాయకుల బీ ట్యాక్స్ గురించి కూడా తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో కమీషన్ల కోసం సొంత పార్టీ కార్యకర్తలకు నీరు– చెట్టు బిల్లులు ఇవ్వకుండా వేధించినది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తాను 200 ఎకరాలు అక్రమంగా సంపాదించానని ఒక్క ఆధారం చూపించినా ఆ పొలాన్ని లోకేశ్‌కే ఇచ్చేస్తానని సవాల్ విసిరారు. మూడు తరాలుగా ఆళ్లగడ్డ ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరిస్తున్నారన్నారు. యువగళం యాత్రలో టీడీపీ నాయకులే పరస్పరం దాడులు చేసుకుని కేసులు పెట్టుకుని పోలీసులు అరెస్ట్ చేస్తే అందుకు అధికార పార్టీ నేతలు కారణమని చెప్పడం ఎంత వరకు సబబు అని పేర్కొన్నారు. ఏవీ సుబ్బారెడ్డిని హత్యకు అఖిలప్రియ సుపారీ ఇచ్చినట్లు కడపలో కేసు నమోదు కావడం, అలాగే హైదరాబాద్‌లో ఇన్‌కంట్యాక్స్ అధికారుల్లా వెళ్లి కిడ్నాప్‌నకు పాల్పడుతూ పోలీసులకు దొరికితే జైలుకు తరలించడం వాస్తవం కాదా అన్నారు. అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ నాయకులను వదలమని బెదిరిస్తే ఎవరూ భయపడరన్నారు. తమది ఆళ్లగడ్డేనని, తాటాకు చప్పుళ్లకు బెదిరిదేలేదన్నారు. వారిలా తల్లి చనిపోతే ఎమ్మెల్యే, తండ్రి చనిపోతే మంత్రి కాలేదన్నారు. ఓ పార్టీలో గెలిచి మరో పార్టీకి అమ్ముడు పోలేదన్నారు. అధికార పార్టీని వదిలి ప్రతిపక్ష పార్టీలో చేరి ప్రజా బలంతో గెలిచానని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటూ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన 50 పడకల ఆసపత్రి, డిగ్రీ కళాశాల, తెలుగుగంగ మరమ్మతుల హామీ నెరవేర్చామన్నారు. టీడీపీ హయాంలో ఆళ్లగడ్డకు ఏమి చేశారో చెప్పాలే కాని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, బాబులాల్, సిగం వెంకటేశ్వర్‌రెడ్డి, సలాం ఉన్నారు.

పిల్లలకు ఆధార్ అప్‌డేషన్ పూర్తి చేయండి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన 0–5 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ అప్‌డేషన్, మ్యాపింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ శామూన్ సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లలకు ఆధార్ కార్డులు అప్‌డేషన్ చేయడంతో పాటు లేనివారికి కొత్తవి ఇప్పించాలన్నారు. అలాగే పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 10,028 మంది బరువు తక్కువగా ఉన్న పిల్లలు ఉన్నారని, రెండు వారాల్లో బరువు పెరిగేలా పోషకాహారాన్ని అందించాలన్నారు. అప్పటికి బరువు పెరగకపోతే ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్‌కు చూపించి చికిత్స అందించాలని సూచించారు. అత్యధిక పోషక లోపం ఉన్న పిల్లలను నేషనల్ రిహాబిలిటేషన్ కేంద్రాలకు తరలించాలన్నారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి పిల్లల హాజరు, పోషకాహారకిట్ల, పాలు, గుడ్లు, బాలామృతం ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు పంపిణీ సక్రమంగా చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులు భర్తీకి అవసరమైన నోటిఫికేషన్లు జారీ చేసి భర్తీ చేసుకోవాలన్నారు. నాడు – నేడు కింద చేపట్టిన 95 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ పీడీ నిర్మలను కలెక్టర్ ఆదేశించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నంద్యాల (న్యూటౌన్): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 87 పరీక్షలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సర పరీక్షలు, మధ్యాహ్నం 2.30 గంటల 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 6,228 మందికిగాను 5,776 మంది హాజరయ్యారు. ఏపీ మోడల్ స్కూల్(పత్తికొండ)లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇద్దరు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ(పత్తికొండ)లో ఒకరు, ఏపీ మోడల్ స్కూల్ మద్దికెరలో ఒక విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడడంతో కేసులు నమోదు చేశారు. మధ్యాహ్నం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షలకు 2,268 మంది విద్యార్థులకుగాను 2,046 మంది హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ(ఆలూరు)లో ఆరు, ఆస్పరి కాలేజీలో ముగ్గురు విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడడంతో తొమ్మిది మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేశారు.

ఉన్నత విద్యకు ప్రభుత్వం భరోసా

- జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల చేసిన సీఎం జగన్
- జిల్లాలో 28,486 మంది విద్యార్థులకు లబ్ధి
- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.23.91 కోట్లు జమ



జగనన్న విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

నంద్యాల: ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తూ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు బహిరంగ వేదిక నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన పథకం నిధులను కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, సంక్షేమ శాఖ డీడీ చింతామణి, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు తదితరులు వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద 2023 జనవరి – మార్చి త్రైమాసికానికి 28,486 మంది విద్యార్థులకు సంబంధించి 25,576 మంది తల్లుల ఖాతాల్లో రూ. 23.91 కోట్లు జమ చేశామన్నారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఆపై ఎక్కువ చదువులు అభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.20వేల చొప్పున ప్రభుత్వం అందజేసిందన్నారు. విద్యాదీవెన కింద ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 4,718 మంది విద్యార్థులకు రూ.3,97,40,552, బనగానపల్లెలో 5,268 మందికి రూ. 4,37,53,823, డోన్‌లో 4,418 మందికి రూ.3,57,37,041, నందికొట్కూరులో 3,901 మందికి రూ.3,10,66,087, నంద్యాలలో 4,956 మందికి రూ. 4,65,86,224, పాణ్యంలో 1,453 మందికి రూ.1,19,68,962, శ్రీశైలంలో 3,772 మందికి రూ. 3,02,83,086 వెరసి మొత్తం 28,486 మంది విద్యార్థులకు సంబంధించి 25,576 మంది తల్లుల ఖాతాల్లో రూ. 23,91,35,775 నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదనే లక్ష్యంతో జగనన్న విద్యా దీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం కలెక్టర్, మార్క్ ఫెడ్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థుల తల్లులకు చెక్కును అందజేశారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



నేను పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాను. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా మా ఫీజులను రీయింబర్స్‌మెంట్ చేయడం సంతోషంగా ఉంది. ఈ పథకం కింద విద్యార్థులకు చదువుల దీవెనలు అందుతున్నాయి. పేదల చదువులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. మా భవిష్యత్తుకు భరోసాను ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎం.దీవెన, డిగ్రీ విద్యార్థి, నంద్యాల

విద్యాదీవెనతో ధైర్యం



నేను పట్టణంలోని డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో బీసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఈ ఏడాది కాలేజీ ఫీజు మొత్తం కట్టాల్సిన అవసరం రాలేదు. ప్రభుత్వమే జగనన్న విద్యాదీవెన కింద చెల్లిస్తుంది. విద్యాదీవెన పథకం ద్వారా విద్యార్థుల పేదరికాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదోలుతున్నారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. ఈ పథకం వలన మాలాంటి పేద విద్యార్థుల్లో ప్రభుత్వం మానసిక ధైర్యాన్ని నింపింది.

– శిరీష, డిగ్రీ విద్యార్థి నంద్యాల

కొత్త మార్గం.. ప్రయాణం సుగమం

➢ కల్లూరు మండలం కొంగనపాడు సమీపంలోని వాగు ఏటా వర్షాకాలంలో పొంగి పొర్లడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉండేది. ఒక్కో సందర్భంలో 24 గంటలకు పైగా వాగులో ప్రవాహం తగ్గకపోవడంతో గ్రామానికి వచ్చిన వారు ప్రవాహం తగ్గేంత వరకు ఎదురు చూడాల్సిందే తప్ప, వేరే మార్గం ద్వారా గ్రామం దాటి వెళ్లలేని పరిస్థితులు ఉండేవి. అలాగే ఈ వాగుపై బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఉల్లిందకొండ నుంచి కోడుమూరు- వెల్దుర్తి రోడ్ వయా కొంగనపాడుకు రోడ్డు మంజూరు కానుండడంతో ఇటు కొంగనపాడు నుంచి కోడుమూరుకు వెళ్లేందుకు 15 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా కానుంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే కొంగనపాడు, ఉల్లిందకొండ, యాపర్లపాడు, ఎర్రకత్వ గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం రూ.3.34 కోట్లతో రోడ్డు, రూ.6.56 కోట్లతో బ్రిడ్జీ నిర్మాణం చేపట్టనుంది.

➢ కోడుమూరు – గూడూరు వయా చనుగొండ్ల మధ్య దూరం కేవలం 10.50 కిలోమీటర్లు మాత్రమే. అయితే ఈ రోడ్డు పూర్తి శిథిలావస్థకు చేరడంతో గతంలో తిరిగిన ఆర్టీసీ బస్సులు కూడా నేడు తిరగక పోవడంతో ఆటోల్లోనే ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఆటోల్లో ప్రయాణించడం ఇష్టం లేని వారు కోడుమూరు నుంచి గూడూరుకు వెళ్లాలంటే గతంలో వయా పెంచికలపాడు మీదుగా వెళ్లేవారు. ప్రస్తుతం రోడ్డు బాగుండడంతో ప్యాలకుర్తి మీదుగా గూడూరుకు చేరుకుంటున్నారు. కాగా కోడుమూరు – గూడూరు రోడ్డును బాగు చేసేందుకు గతంలో పలువురు చేసిన ప్రయత్నాలన్ని విఫలమయ్యాయి. ఎట్టకేలకు ఈ రోడ్డును పీఎంజీఎస్‌వై నిధులు రూ.6.79 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.


కొంగనపాడు సమీపంలోని వాగు (ఫైల్)

- పీఎంజీఎస్‌వై కింద రూ.42 కోట్లతో నాలుగు రోడ్లు, మూడు బ్రిడ్జీలు
- హిందూపురం ఎంపీ ప్రతిపాదనలతో గార్గేయపురం – పసుపుల రోడ్డు
- కొంగనపాడు బ్రిడ్జీ నిర్మాణంతో తగ్గనున్న ప్రయాణ దూరం
- తీరనున్న 30 గ్రామాల ప్రజల వెతలు


శిథిలమైన కొరటమద్ది-బండిఆత్మకూరు రోడ్డు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో దశాబ్దాలుగా గుంతలు పడి, కంకర తేలి నడిచేందుకు కూడా ఇబ్బందికరంగా ఉన్న గ్రామీణ రోడ్లకు మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో రూ.42.09 కోట్లతో 34.12 కిలోమీటర్ల మేర నాలుగు రోడ్లు, మూడు హైలెవెల్ బ్రిడ్జీలను నిర్మించనున్నారు. ఈ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో మంజూరు వస్తుందని ఇటీవలే జిల్లాకు వచ్చిన పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్ చెప్పారు. ప్రస్తుతం చేపట్టనున్న నాలుగు రోడ్లు, మూడు బ్రిడ్జీల పనులు పూర్తి అయితే దాదాపు 20 నుంచి 30 గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యాలకు సంబంధించి ఎదుర్కొంటున్న ఇబ్బంధులు తొలగనున్నాయి. ఈ రోడ్లు, బ్రిడ్జీల వల్ల ఆయా గ్రామాల ప్రజలకు సమీప ప్రాంతాలకు వెళ్లేందుకు దూరం తగ్గడంతో పాటు వ్యయ ప్రయాసాలు సమసిపోనున్నాయి. ఈ పనులన్నీ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. అనంతపురం జిల్లా హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ ప్రతిపాదనలతో కర్నూలు మండలంలోని గార్గేయపురం – పసుపుల (వయా శివరాంపురం, రుద్రవరం) రోడ్డు వేయనున్నారు. పీఎంజీఎస్‌వై నిధులు రూ.4.80 కోట్లతో 10.207 కిలోమీటర్ల మేర కొత్త రోడ్డును ఏర్పాటు చేయనున్నారు.

ఏ పనులు చేపట్టనున్నారంటే ...

మండలం	పనిపేరు	అంచనా మొత్తం (రూ.లక్షల్లో)	కి.మీ
గడివేముల	కొరటమద్ది నుంచి బండిఆత్మకూరు వయా ఎర్రగుంట్ల	370.20	6.50
కల్లూరు	ఉల్లిందకొండ నుంచి కోడుమూరు వెల్దుర్తి రోడ్ వయా కొంగనపాడు	334.15	6.913
గూడూరు	గూడూరు నుంచి కోడుమూరు వయా చనుగొండ్ల	679.00	10.50
కర్నూలు	గార్గేయపురం నుంచి పసుపుల వయా శివరాంపురం, రుద్రవరం	480.50	10.207
కల్లూరు	ఉల్లిందకొండ నుంచి కోడుమూరు వెల్దుర్తి రోడ్ వయా కొంగనపాడు కి.మీ 4/4 – 4/6 లోకల్ వాగుపై హై లెవెల్ బ్రిడ్జి	656.00	---
సంజామల	ఆకుమల్ల నుంచి బనగానపల్లె పాలేరు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి	796.11	---
శిరివెళ్ల	శిరివెళ్ల నుంచి చందలూరు వయా ఎర్రగుడిదిన్నె చిలకలూరు రోడ్డులో వక్కిలేరు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి	893.92	---

వంతెన నిర్మిస్తే ఎంతో మేలు



మా గ్రామ సమీపంలోని వాగుపై వంతెన నిర్మాణం చేపడితే చాలా ఉపయోగంగా ఉంటుంది. ముఖ్యంగా కొంగనపాడు గ్రామ ప్రజలు ప్రజలు కోడుమూరుకు చేరుకునేందుకు 15 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. లద్దగిరి గ్రామం నుంచి ఈ వంతెన మీదుగా నేరుగా ఎన్‌హెచ్ 44కు చేరుకోవచ్చు. ప్రతి వర్షాకాలంలో ఈ వాగులో నీటి ప్రవాహం అధికంగా ఉండడం వల్ల చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం వేయనున్న కొత్త రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే నాలుగైదు గ్రామాల ప్రజల రాకపోకలకు ఉన్న కష్టాలు తొలగిపోతాయి.

– గడ్డం కేశవరెడ్డి, కొంగనపాడు

గడువులో పనులు పూర్తి చేస్తాం



పీఎంజీఎస్‌వై కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు రోడ్లు, మూడు హైలెవెల్ బ్రిడ్జీల నిర్మాణం చేపట్టనున్నాం. వీటికి సంబంధించిన మంజూరు త్వరలోనే వస్తుందని ఇటీవలే తమ ఈఎన్‌సీ వెల్లడించారు. ఈ పనులకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పూర్తి నాణ్యతతో ఈ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎస్‌ఈ మద్దన్న ఈఈ, పీఆర్

పెళ్లి కాలేదని కలతతో..

కర్నూలు: పెళ్లి కాలేదని కలత చెంది బుధవారపేటకు చెందిన బొల్లవరం రాజేష్‌కుమార్ (38 ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారపేటలో సుప్రియ ల్యాబ్‌ను చెల్లెలు దామినితో కలసి రాజేష్‌కుమార్ నడుపుతుండేవాడు. ఈనెల 21వ తేదీ రాత్రి 9:30 గంటల సమయంలో సి.క్యాంప్‌లోని తన చెల్లెలు దామిని ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకోగా చెల్లెలితో పాటు తమ్ముడు చార్లెస్ కుమార్ కనుగొని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. గత ఐదేళ్లుగా పెళ్లి సంబంధాల కోసం ప్రయత్నించినప్పటికీ వివాహం జరగకపోవడంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి బొల్లవరం కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

105 ఏళ్ల వృద్ధురాలు మృతి


వృద్ధురాలు సుబ్బమ్మ

రుద్రవరం: శ్రీరంగాపురంలో 105 ఏళ్ల వృద్ధురాలు సుబ్బమ్మ బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆమెకు వివాహం అయిన కొన్నేళ్లకే భర్త మృతి చెందాడు. వారికి సంతానం ఎవ్వరు లేరు. మేనల్లుడు వెంకటసుబ్బయ్యనే బాగోగులు చూసేవారు. నెల రోజులు క్రితం వరకు ఆరోగ్యంగా ఉన్న వృద్ధురాలు తన పనులతో పాటు ఇంటి పనులు చేస్తూ ఉండేది. అంత వయస్సులోను కుటుంబంలోని చిన్న పిల్లలకు చేసే సపర్యలను చూసి గ్రామస్తులు ఆశ్చర్యంగా చూసేవారు. ఎండ తీవ్రతకు తాళలేక నెల రోజుల నుంచి కాస్త నీరసంగా ఉంటూ బుధవారం మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

దొర్నిపాడు: చాకరాజువేముల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(62) రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడింది. ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం లక్ష్మీదేవి ఉపాధి హామీ పనులకు రహదారిపై నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ వెనుక వైపు నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూర్య ప్రతాపం



భానుడు భగభగలాడుతున్నాడు. ఉదయం 8 గంటల నుంచే తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడగాల్పుల ధాటికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొందరు గొడుగులు ధరించి ఎండ వేడిమి నుంచి రక్షణ పొందుతుండగా.. మరికొందరు తువాళ్లతో నెత్తిని కప్పుకుంటూ ముందుకుసాగుతున్నారు. కర్నూలు నగరంలో ఆదివారం మధ్యాహ్నం కనిపించిన దృశ్యమిది.

–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

మాజీమంత్రి అఖిలప్రియకు బెయిల్

బొమ్మలసత్రం: నంద్యాల సీనియర్ టీడీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డిపై హత్యాయత్నం కేసులో ఏ1 నిందితురాలు అఖిలప్రియకు కోర్టు కండీషన్ బెయిల్ మంజూరు చేసింది. యువగళం పాదయాత్రలో తన అనుచరులతో హత్యాయత్నానికి పాల్పడినట్లు తాలుకా పోలీసులకు ఏవీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మాజీమంత్రి అఖిలప్రియతో పాటు ఆమె భర్త భార్గవరామ్ మరి కొంత మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లా జడ్జి సునీత బుధవారం అఖిలప్రియకు మాత్రమే కండీషన్ బెయిల్ మంజూరు చేశారు. ప్రతి గురు, ఆది వారాలు తప్పని సరిగా తాలుకా స్టేషన్‌కు వెళ్లి ఆమె సంతకం చేయాల్సి ఉంది. పోలీసుల అనుమతి లేకుంకా పట్టణం దాటి వదిలివెళ్లవద్దని కోర్టు హెచ్చరించింది.

యువకుడి దుర్మరణం


హర్షవర్ధన్ (ఫైల్)

పాణ్యం: భూపనపాడు గ్రామానికి చెందిన యువకుడు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సువర్ణ, చిన్న రాముడుల దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు హర్షవర్ధన్(23) ఫర్నిచర్ షాప్ నిర్వహిస్తున్నాడు. వ్యాపార పనుల నిమిత్తం మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున బైక్‌పై తిరుగు వస్తుండగా జడ్జెర్ల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృత్యువాత పడ్డాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు..

మహానంది: నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామ సమీపంలోని ప్రభాత్ కాలేజీ నుంచి ఏ.కోడూరు వెళ్లే మార్గంలో మంగళవారం రాత్రి ఓ వృద్ధుడు నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందాడు. ఆచూకీ గుర్తించిన వారు బండిఆత్మకూరు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ బాబు కోరారు.

ఎమ్మెల్యే కాటసానికి మాతృ వియోగం

- నివాళులర్పించిన పలువురు ప్రజాప్రతినిధులు


పుల్లమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి తదితరులు

అవుకు: బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి మాతృ వియోగం కలిగింది. ఎమ్మెల్యే తల్లి కాటసాని పుల్లమ్మ (90) అనారోగ్యంగా ఉండటంతో కొన్ని రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి ఆమె కన్ను మూశారు. అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామమైన అవుకు మండలం గుండ్లశింగవరం గ్రామానికి బుధవారం తీసుకువచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి, కాటసాని శివనరసింహ రెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి, కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, కాటసాని వెంకటేశ్వర రెడ్డి తదితర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అంతక్రియలను నిర్వహించారు. విషయం తెలుసుకున్న తెలుసుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి, మాజీ జెడ్పీచైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, సీనియర్ నాయకులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, అవుకు సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, చల్లా రఘునాథ రెడ్డి,సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, గుండం శేషి రెడ్డి, గుండం సూర్య ప్రకాశ్ రెడ్డి, పోచా శీలారెడ్డి, దుగ్గి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు ఆమె పార్థివదేహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


కాటసాని పుల్లమ్మ (ఫైల్)

బదిలీల సందడి

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి మొదలైంది. ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని బదిలీ చేయాలనే నిబంధనల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులు, కార్యాలయ పర్యవేక్షకులు, ఉద్యోగులు, నాల్గవ తరగతి సిబ్బంది సర్వీసు వివరాలను పరిశీలించే కార్యక్రమంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 69 మంది వసతి గృహ సంక్షేమాధికారులలో నలుగురికి మాత్రమే ఐదేళ్ల సర్వీసు పూర్తి అయ్యింది. అలాగే మొత్తం 121 మంది నాల్గవ తరగతి సిబ్బంది (కామాటీ, కుక్, వాచ్‌మెన్)లో ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిన వారిలో 16 మంది మాత్రమే ఉన్నారు. బదిలీకి సిద్ధంగా ఉన్న వారు ఇప్పటికే తమ దరఖాస్తులను కార్యాలయంలో అందజేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగుల బదిలీలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

26లోగా దరఖాస్తు చేసుకోండి

జిల్లాపరిషత్ పరిధిలోని వివిధ కార్యాలయాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీలకు సంబంధించి ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీ పరిధిలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న 105 మంది ఉద్యోగులకు ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి అయిందన్నారు. వీరిలో ఎంపీడీఓ 1, ఏఓ 2, సీనియర్ అసిస్టెంట్లు 4, జూనియర్ అసిస్టెంట్లు 12, టైపిస్టులు 5, రికార్డు అసిస్టెంట్ 5, లైబ్రరీ అసిస్టెంట్ 9, ల్యాబ్ అసిస్టెంట్ 3, ఆఫీస్ సబార్డినేట్ 56, గార్డెనర్ కమ్ స్వీపర్ 6, వాచ్‌మెన్ 2 పోస్టులకు సంబంధించి ఐదేళ్లు పూర్తి చేసుకున్నారని చెప్పారు.

26న ఐసీడీఎస్ ఉద్యోగులకు కౌన్సెలింగ్

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో బదిలీలకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ పేర్కొన్నారు. ఇటీవలే కొన్ని ప్రాజెక్టుల విలీనం, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుతో ఖాళీగా ఉన్న వారికి ఈ నెల 26వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇస్తామని, 29న సాధారణ బదిలీలు చేపట్టి ఆర్డర్స్ ఇస్తామని వెల్లడించారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో నాట్ విల్లింగ్ జాబితా

కర్నూలు(సిటీ): ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే షెడ్యూల్ జారీ చేసింది. గ్రేడ్-2 హెచ్ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లకు, స్కూల్ అసిస్టెంట్లుగా ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించనున్నారు. పదోన్నతులు తీసుకునేందుకు అంగీకరించని వారి నుంచి బుధవారం ఇందిరాగాంధీ మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో నాట్ విల్లింగ్ ఫారాలను స్వీకరించారు. ఈ వివరాలన్నీ డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రంగారెడ్డి తెలిపారు. బయలాజికల్ సైన్స్, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించి పెంచిన సీనియారిటీ జాబితాలోని వారి వివరాలు డీఈఓ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు. ఈ జాబితాలో పేర్లు కలిగిన ఉపాధ్యాయులు తమకు ప్రమోషన్ అవసరం లేదని భావిస్తే నాట్ విల్లింగ్ ఫారాన్ని నేటి(గురువారం) లోపు అందజేయాలని డీఈఓ తెలియజేశారు. ఉమ్మడి జిల్లాలో నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి వివరాలు సబ్జెక్టు వారీగా .. స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) 285, గణితం 275, సోషల్ 639, బయలాజికల్ సైన్స్ 415, ఫిజికల్ సైన్స్ 528 మంది ఉన్నారు.

పరిమళించిన మానవత్వం

- అచేతనంగా పడి ఉన్న వృద్ధురాలు ఆసుపత్రికి తరలింపు


చికిత్స పొందుతున్న వృద్ధురాలు (ఇన్‌సెట్) అచేతనంగా..

వెల్దుర్తి: ముళ్ల పొదలో అచేతనంగా పడి ఉన్న ఓ వృద్ధురాలి చూసి యువకులు చలించారు. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాలను కాపాడారు. బుధవారం తెల్లవారుజామున వెల్దుర్తి నుంచి రామళ్లకోటకు వెళ్లే రోడ్డులో పరమేశ్ సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద ముళ్లపొదల్లో దాదాపు 80 ఏళ్ల పైబడిన వృద్ధురాలు అచేతనంగా పడి ఉన్నారు. వెల్దుర్తికి చెందిన పోస్టల్ ఏజెంట్ వేమన గుర్తించి ఆమెను ముళ్ల పొదల్లోంచి పక్కనే ఉన్న ఒక చెట్టు వద్దకు చేర్చారు. ఆమె శరీరానికి చీమలు పట్టి ఉండడం గుర్తించి వెల్దుర్తి సచివాలయం 2 గ్రామ వలంటీర్ లక్ష్మీకాంత రెడ్డి, స్థానిక విలేకరి సహకారంతో ఆటో డ్రైవర్ బాషా ఆటోలో స్థానిక సామాజిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స చేయడంతో ఆమెలో కొంత కదలిక వచ్చింది. ఏఎస్‌ఐ శివరామిరెడ్డి ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. వృద్ధురాలు తన పేరు సాలమ్మ అని ఒకసారి, రామలక్ష్మి అని మరోసారి తెలుపుతూ, తన భర్త పేరు నాగేంద్ర అని, తనది ఈదుల దేవరబండ అని తెలపడంతో ఆవైపు విచారణ ప్రారంభించారు. వృద్ధురాలిని మెరుగైన ఆరోగ్యం కోసం వైద్యుల సిఫారసు మేరకు 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వృద్ధురాలిని గుర్తించిన వారు ఆసుపత్రికి చేరుకోవాలని, తమను సంప్రదించాలని వెల్దుర్తి పోలీసులు కోరారు.

క్లుప్తంగా

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు.ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణ కార్యక్రమం జూన్ 10న మొదలై 30 రోజుల పాటు ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారై ఉండాలని, చదవడం, రాయడం వచ్చి ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 63044 91236 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

చేపలవేటకు వెళ్లి మృత్యువాత


లక్ష్మన్న (ఫైల్)

కొత్తపల్లి: పాతసిద్దేశ్వరం గ్రామానికి చెందిన ఓ మత్స్యకారుడు చేపలవేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన దాసరి లక్ష్మన్న (38) మంగళవారం సాయంత్రం సమీపంలోని కృష్ణానదిలో చేపల వేటకు పుట్టిలో వెళ్లి వల వేశాడు. రాత్రి వేళ నదిలో ఈదురు గాలులకు అలల ఉధృతికి పుట్టి బోల్తా పడింది. ఈ సమయంలో పుట్టిలో ఉన్న లక్ష్మన్న నీటిలో పడిపోయి చేపల కోసం వలలో చిక్కుకునిపోయి ఊపిరాడక మృతి చెందాడు. చేపల వేటకు వెళ్లిన భర్త తిరిగి రాకపోవడంతో భార్య శివమ్మ ఆందోళన చెందింది. బుధవారం ఉదయం నదిలో గాలించగా, పుట్టి బోల్తా పడి ఉండటంతో వలను బయటకు తీసి చూడగా లక్ష్మన్న మృతి చెంది కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బాబా ఫకృద్దీన్ తెలిపారు.

జూన్ 19 నుంచి డీఎడ్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: డీఎడ్ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి బుధవారం షెడ్యూల్ జారీ చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. జూన్ 19న చైల్డ్ హుడ్, చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ లెర్నింగ్(పేపర్-1), 20న సొసైటీ, ఎడ్యుకేషన్ అండ్ కరిక్యులమ్(పేపరు-2), 21న ఎర్లీ చైల్డ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్(పేపరు-3), 22న ప్రాథమిక దశలో మాతృభాష పెడగాగి(పేపరు-4), 23న ప్రాథమిక దశలో గణితం పెడగాగి(పేపరు-5), 24న పెడగాగి అక్రాస్ కరిక్యులమ్ అండ్ ఐసీటీ ఇంటిగ్రేషన్(పేపరు-6) పరీక్షలు జరగనున్నాయి.

చెల్లని చెక్కులు ఇచ్చిన ఎంపీడీఓకు జైలు

కర్నూలు(లీగల్): చెల్లని చెక్కులు ఇచ్చిన కేసులో మండల పరిషత్ అభివృద్ధి అధికారికి 6 నెలల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బుధవారం తీర్పు చెప్పింది. నగరంలోని బృందావన్ నగర్‌కు చెందిన సీతారామిరెడ్డి అనే వ్యక్తి వద్ద కృష్ణగిరి ఎంపీడీఓగా పనిచేసిన ఎం.ఫజుల్ బాషా 2012 జూన్ 5వ తేదీన తన అవసరం నిమిత్తం రూ.5 లక్షలు అప్పు తీసుకుని ప్రొంసరీ నోటు రాసిచ్చాడు.

ఆ అప్పు తీర్చడంలో భాగంగా 2014 సంవత్సరం జూన్ 17వ తేదీన రూ.3 లక్షల విలువైన రెండు బ్యాంకు చెక్కులిచ్చాడు. ఫజుల్ బాషా ఖాతాలో డబ్బు లేక చెక్కులు చెల్లలేదు. దీంతో సీతారామిరెడ్డి కోర్టును ఆశ్రయించగా కేసును విచారించిన న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్ నిందితుడు ఫజుల్ బాషాకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఫజుల్ బాషా ప్రస్తుతం చిప్పగిరి ఎంపీడీఓగా పనిచేస్తూ కొన్ని రోజులుగా సెలవులో ఉన్నారు.